## భవానీమాత ఆలయంలో ఎమ్మెల్యే పూజలు



ఫరూఖ్‌నగర్ మండలంలోని భవానీమాత ఆలయంలో శుక్రవారం ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ తన జన్మదినం సందర్భంగా అమ్మవారికి పూజలు చేశారు.
**- షాద్‌నగర్‌రూరల్, మార్చి 15**

## దొంగతనం కేసులో నిందితుడికి రిమాండ్

మంచాల, మార్చి 15 : దొంగతనం చేసిన కేసును మంచాల పోలీసులు 48గంటల్లో ఛేదించి యువకుడిని రిమాండ్‌కు తరలించారు. మంచాల ఎస్సై రవినాయక్ శుక్రవారం సాయంత్రం తెలిపిన వివరాల ప్రకారం మండల పరిధిలోని లింగంపల్లి గ్రామానికి చెందిన కసరమోని మల్లేశ్ తన ఇంటికి తాళం వేసి వ్యవసాయ పనులకు వెళ్లారు. పెద్దఅంబర్‌పేట్ మండలం బతుకమ్మ కుంట కాలనీకి చెందిన అల్లం శివ ఈనెల 11న లింగంపల్లిలో ఇంటికి తాళం వేసిన ఇంటిని గుర్తించి దొంగతనం చేసినట్లు చెప్పారు. ఇంట్లో ఉన్న 28గ్రాముల బంగారంతో పాటు నగదును శివ ఎత్తుకెళ్లినట్లు మల్లేష్ పోలీసులకు ఫిర్యాదు చేశాడు. కేసు నమోదు చేసుకొని దర్యాప్తును చేపట్టి శివ వేలి ముద్రలు, సీసీకెమెరాల ఆధారంగా నిందుతుడిని గుర్తించి రిమాండ్‌కు తరలించినట్లు పోలీసులు తెలిపారు.

# పౌష్టికాహారంతో సంపూర్ణ ఆరోగ్యం

**పోల్కంపల్లిలో పోషణ పక్షం కార్యక్రమంలో సీడీపీవో శాంతిశ్రీ**

ఇబ్రహీంపట్నంరూరల్, మార్చి 15 : రోజువారి ఆహారంలో చిరుధాన్యాలు తప్పనిసరిగా చేర్చుకోవటంతో సంపూర్ణ ఆరోగ్యంగా ఉంటారని ఇబ్రహీంపట్నం ఐసీడీఎస్ సీడీపీవో శాంతిశ్రీ అన్నారు. ఈనెల 9న ప్రారంభమైన పోషణ్ అభియాన్ కార్యక్రమాన్ని శుక్రవారం పోల్కంపల్లి గ్రామంలో నిర్వహించారు. ఈ సందర్భంగా సీడీపీవో శాంతిశ్రీ మహిళలు, చిన్నారులు, గర్భిణులు, బాలింతలకు పంచాయతీ ఆవరణలో అవగాహన కల్పించారు. రోజువారి ఆహారంలో చిరుధాన్యాలు చేర్చుకోవటంతో పాటు ఆకుకూరలు, కూరగాయలు, పండ్లు, ధాన్యాలు, పప్పుదినుసులతో పౌష్టికాహారాన్ని తీసుకుంటే సంపూర్ణ ఆరోగ్యంగా ఉంటారన్నారు. ఈ కార్యక్రమంలో ఐసీడీఎస్ సూపర్‌వైజర్లు పాఠశాల ఉపాధ్యాయులు, అంగన్‌వాడీ టీచర్లు, విద్యార్థులు, గ్రామస్థులు పాల్గొన్నారు.



పోషణ పక్షం కార్యక్రమంలో భాగంగా ప్రతిజ్ఞ చేయిస్తున్న సీడీపీవో శాంతిశ్రీ



అవగాహన కోసం ఏర్పాటు చేసిన ఆకుకూరలు, కూరగాయల స్టాళ్లు

**తల్లిదండ్రులు అవగాహన కలిగి ఉండాలి**

చేవెళ్లటౌన్ : పౌష్టికాహారంపై తల్లిదండ్రులకు అవగాహన కలిగి ఉండాలని సీడీపీవో శోభారాణి తెలిపారు. శుక్రవారం చేవెళ్ల మండల కేంద్రంలో పోషకాహార పక్షోత్సవాలు, అంతర్జాతీయ మహిళా దినోత్సవం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. టీచర్లు చిన్నారులకు పూర్వప్రాథమిక విద్యను అందించడంతో పాటు ఆరోగ్యవంతమైన భవిష్యత్‌ను అందించాలని కోరారు. మహిళలు అన్ని రంగాల్లో అభివృద్ధి చెందాలని సూచించారు. కార్యక్రమంలో ఐసీడీఎస్ సూపర్‌వైజర్లు, సిబ్బంది, అంగన్‌వాడీ టీచర్లు, ఆయాలు పాల్గొన్నారు.



చేవెళ్లటౌన్: సమావేశంలో మాట్లాడుతున్న సీడీపీవో

## నైపుణ్య కోర్సులపై ఉచిత శిక్షణ

చేవెళ్లటౌన్, మార్చి 15 : చేవెళ్ల మండల కేంద్రంలోని ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో చేవెళ్ల ఎస్‌బీఐ బ్యాంక్, గ్రామీణ ఉపాధి శిక్షణ సంస్థ ఆధ్వర్యంలో వివిధ నైపుణ్య కోర్సుల గురించి కళాశాల ప్రిన్సిపాల్ కంచన లత అధ్యక్షతన విద్యార్థులకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా కళాశాల ప్రిన్సిపాల్ కంచనలత మాట్లాడుతూ.. గ్రామీణ ఉపాధి శిక్షణ సంస్థ ద్వారా 30 రోజుల పాటు సమ్మర్ క్యాంపులో 18 రకాల నైపుణ్యాలపై విద్యార్థులకు నిర్వహించే ఉచిత కోర్సులు ఎంతో ఉపయోగపడుతాయని తెలిపారు. దీనిలో భాగంగా మగ్గం వర్కు, సెల్ఫ్ సర్వీసింగ్ రిపేరింగ్, టైలరింగ్, బ్యూటిపార్లర్, సీసీ టీవీ, కార్ డ్రైవింగ్, జ్యూట్ బ్యాగుల తయారీ, కొవ్వొత్తుల తయారీ, అగర్‌బత్తీల తయారీ, పుటగొడుల పెంపకంలాంటి వాటిపై ఉచిత శిక్షణతో పాటు భోజనం, వసతి కల్పించనున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో జ్యోతి, వైష్ణవి, అధ్యాపకులు, విద్యార్థులు ఉన్నారు.

## చిరస్మరణీయుడు కాన్షీరాం



తుర్కయాంజాల్, మార్చి 15 : బీఎస్పీ వ్యవస్థాపకుడు కాన్షీరాం జయంతిని తుర్కయాంజాల్ మున్సిపాలిటీ చౌరస్తాలో బీఎస్పీ మున్సిపాలిటీ అధ్యక్షుడు వద్దిగళ్ల బాబు అధ్యక్షతన ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా పలువురు కాన్షిరాం చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించి మాట్లాడారు. కార్యక్రమంలో బీఎస్పీ, దళిత, ప్రజాసంఘాల నాయకులు పాల్గొన్నారు.

## ఆలయ అభివృద్ధికి దాతలు ముందుకు రావాలి

కడ్తాల్, మార్చి 15: ఆంజనేయస్వామి ఆలయ అభివృద్ధికి దాతలు ముందుకు రావాలని ఆలయ అభివృద్ధి కమిటీ సభ్యులు కోరారు. తలకొండపల్లి మండల పరిధిలోని మెదక్‌పల్లి గ్రామంలో చేపట్టిన ఆంజనేయస్వామి ఆలయ నిర్మాణానికి, శుక్రవారం సాయంత్రం బానవత్ చందు చారిటబుల్ ట్రస్టు చైర్మన్ బీమ్‌లాల్ రూ.10 వేలను కమిటీ సభ్యులకు అందజేశారు. కార్యక్రమంలో గడ్డమీది తండా మాజీ ఉప సర్పంచ్ శేష్యానాయక్, తండావాసులు పాల్గొన్నారు.

# ప్రతి పౌరుడు స్వేచ్ఛగా ఓటు వేయాలి

**- సమస్యాత్మక గ్రామాల్లో పోలీస్ బలగాల కవాతు - ప్రజలకు ఓటు హక్కు వినియోగంపై అవగాహన కల్పించిన పోలీసులు**



ఫ్లాగ్ మార్చ్ నిర్వహిస్తున్న పోలీస్ బలగాలు, సిబ్బంది



యాచారం, మార్చి15 : లోక్‌సభ ఎన్నికలను దృష్టిలో ఉంచుకొని సమస్యాత్మక గ్రామాల్లో పోలీసుల బలగాలు సీఐ శంకర్‌కుమార్ ఆధ్వర్యంలో గురువారం రాత్రి కవాతు నిర్వహించాయి. మండలంలోని మంథన్‌గౌరెల్లి, నల్లవెల్లి, తులేఖుర్దు గ్రామాల్లో కేంద్ర పోలీసు బలగాలు కవాతు చేపట్టాయి. ఈ సందర్భంగా సీఐ శంకర్‌కుమార్ మాట్లాడుతూ.. భద్రతపై ప్రజలకు భరోసా కల్పించేందుకు ఫ్లాగ్ మార్చ్ నిర్వహించినట్లు తెలిపారు. ఎన్నికల్లో ప్రతి పౌరుడు తన ఓటు హక్కును స్వేచ్ఛగా వినియోగించుకోవాలన్నారు. ఎన్నికల్లో ఎవరూ నిబంధనలు ఉల్లంఘించొద్దని, అతిక్రమిస్తే చట్టరీత్యా చర్యలు తీసుకుంటామన్నారు. కార్యక్రమంలో ఎస్సై గోపాల్, వెంకటనారాయణ, కేంద్ర పోలీస్ బలగాలు, పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

**మంచాల ఆరుట్లలో**

మంచాల : రాబోయే లోక్‌సభ ఎన్నికల నేపథ్యంలో ఓటర్లలో నైతిక ఆత్మస్థైర్యం నింపేందుకు శుక్రవారం సాయంత్రం మంచాల మండలం ఆరుట్ల, మంచాల గ్రామాల్లో సీఐ బాబ్యానాయక్ ఆధ్వర్యంలో 40మంది సీఐఎస్‌ఎఫ్ జవాన్లు, 20మంది పోలీసులు గ్రామాల్లో ఫ్లాగ్‌మార్చ్ నిర్వహించారు. ఈ సందర్భంగా సీఐ మాట్లాడుతూ.. రాబోయే ఎన్నికల్లో ప్రతి ఒక్కరూ ఓటు హక్కును స్వేచ్ఛగా వినియోగించుకునేలా ప్రజలకు పోలీసులు ఉన్నారని భరోసా కల్పించేందుకు గ్రామాల్లో కవాతు నిర్వహించినట్లు చెప్పారు. కార్యక్రమంలో ఎస్సైలు రవినాయక్, సతీశ్, పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

## వందశాతం ఉత్తీర్ణత సాధించాలి



మంచాల, మార్చి 15 : పదో తరగతి పరీక్షల్లో విద్యార్థులు కష్టపడి చదివి వందశాతం ఉత్తీర్ణత సాధించాలని మాజీ సర్పంచ్ కొంగర విష్ణు వర్ధన్‌రెడ్డి అన్నారు. మంచాల మండలం ఆరుట్ల జిల్లా పరిషత్ పాఠశాలలో పదో తరగతి పరీక్షలకు హాజరయ్యే విద్యార్థులకు రాజూనాయక్ తన సొంత డబ్బులతో పరీక్ష ప్యాడ్లను విష్ణువర్ధన్‌రెడ్డితో కలిసి విద్యార్థులకు శుక్రవారం అందజేశారు. ఈకార్యక్రమంలో గ్రామస్తులు మెగావత్ జీవిలాల్‌నాయక్, సురేశ్‌నాయక్, కృష్ణ, శ్రీకాంత్, అఖిల్, వంశీ, రావుల్, హరికుమార్, రమేశ్ తదితరులు పాల్గొన్నారు.

## ఘనంగా స్వపరిపాలన

షాద్‌నగర్‌రూరల్, మార్చి 15 : ఫరూఖ్‌నగర్ మండలంలోని రాయికల్ ఉన్నత పాఠశాలలో శుక్రవారం స్వపరిపాలన దినోత్సవాన్ని విద్యార్థులు ఘనంగా నిర్వహించారు. విద్యార్థులు ఉపాధ్యాయులుగా వ్యవహరిస్తూ తోటి విద్యార్థులకు పాఠ్యాంశాలను బోధించారు. ఈ సందర్భంగా పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు జయమ్మ మాట్లాడుతూ.. నేటి సమాజంలో ఉపాధ్యాయుల పాత్ర ఎంతో కీలకమన్నారు. విద్యార్థుల ఉజ్వల భవిష్యత్‌కు ఉపాధ్యాయులు కృషి చేయాలన్నారు. విద్యార్థులు శ్రద్ధగా చదువుకొని ఉన్నత శిఖరాలను అధిరోహించాలని సూచించారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.



విద్యార్థులతో ఉపాధ్యాయులు

## వాగులో పడి వ్యక్తి మృతి

కొత్తూరు, మార్చి 15 : చేపల వేటకు వెళ్లి వాగులో పడి ఓ వ్యక్తి మృతి చెందాడు. ఈ ఘటన కొత్తూరు పోలీస్‌స్టేసన్ పరిధిలో జరిగింది. సీఐ నరసింహారావు వివరాల ప్రకారం.. మల్లాపూర్‌కు చెందిన తంగెడిపల్లి కృష్ణయ్య (55) గురువారం సాయంత్రం చేపల వేటకు వెళ్లేందుకు కొత్తూరు మండల పరిధిలోని మల్లాపూర్ వాగు వద్దకు వెళ్లాడు. అయితే ప్రమాద వశాత్తు అందులో పడి గల్లంతయ్యాడు. శుక్రవారం ఉదయం నుంచి గ్రామంలోని యువకులు వాగులో కృష్ణయ్య కోసం గాలించగా, మధ్యాహ్నం కృష్ణయ్య మృతదేహం కనిపించింది. భార్య రాములమ్మ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని సీఐ తెలిపారు. పోస్టుమార్టం కోసం మృతదేహాన్ని షాద్‌నగర్ ప్రభుత్వ దవాఖానకు తరలించామని వివరించారు.

## హత్యాయత్నం కేసులో వ్యక్తికి జైలు

చేవెళ్ల రూరల్, మార్చి 15 : చేవెళ్ల మండల పరిధి దామరగిద్ద గ్రామానికి చెందిన బేగరి జంగయ్య అనంతమ్మ దంపతులను అదే గ్రామానికి చెందిన బేగరి వెంకటయ్య భూ తగాదాల విషయమై 2022వ సంవత్సరంలో కర్రలతో దాడి చేయగా.. అదే సమయంలో గొడవను సద్దుమణిగించడానికి వెళ్లిన గ్రామానికి చెందిన దివ్యాంగుడు ప్రభాకర్‌పై సైతం దాడిచేయగా, చేవెళ్ల పోలీస్‌స్టేషన్‌లో కేసు నమోదైంది. శుక్రవారం చేవెళ్ల ఏఎస్ జే కోర్టులో సీనియర్ సివిల్ జడ్జి శ్రీదేవి హత్యాయత్నం కేసులో నిందితుడు బేగరి వెంకటయ్యకు ఒక సంవత్సరం జైలు శిక్షతో పాటు రూ.5వేలు జరిమానా విధించారు.



తహసీల్దార్‌కు వినతి పత్రం అందజేస్తున్న గ్రామస్తులు

## అక్రమ నిర్మాణాలు నిలిపివేత

మొయినాబాద్, మార్చి 15 : చెరువు శిఖం భూమిలో అక్రమ నిర్మాణాన్ని ఆపాలని తహసీల్దార్‌కు గ్రామస్తులు వినతి పత్రం అందించారు. మండల పరిధిలోని చిన్నమంగళారం గ్రామంలోని సర్వే నంబర్ 132, 133, 134 లోని శిఖం పట్టాలోని భూమిలో నిబంధనలకు విరుద్ధంగా అక్రమంగా నిర్మి స్తున్న షెడ్డును ఆపివేయాలని గ్రామస్తులు శుక్రవారం తహసీల్దార్ గౌతంకుమార్‌కు వినతి పత్రం అందించారు. వెంటనే నిర్మాణాన్ని ఆపివేయాలని కింది స్థాయి అధికారులను ఆదేశించడంతో అధికారులు నిర్మాణాలను నిలిపివేశారు. కార్యక్రమంలో నాయకులు ఆంజనేయులుగౌడ్, ఎన్ రాములు, బి.శంకర్, ఏ రాములు, ఎం.కృష్ణ, పి.భిక్షపతి, రామచందర్, పి.వెంకట్‌రెడ్డి, ఎండీ జహంగీర్, బాల్‌రాజ్, ఎండీ అజ్మాత్, శివశంకర్, శ్రీనివాస్, ఎండీ షాకీర్, శ్రీకాంత్, వెంకటేశ్, లక్ష్మణ్, సీహెచ్ రాజు, శ్రీకాంత్, వెంకటేశ్, మహేశ్, సీహెచ్ శంకరయ్య, శేఖర్, కృష్ణ పాల్గొన్నారు.

## మెడికల్ షాపుల నిర్వాహకుల సమస్యలపై కెమిస్ట్, డ్రగ్గిస్ట్ అసోసియేషన్ భేటీ

పెద్దఅంబర్‌పేట, మార్చి 15 : హయత్‌నగర్ జోన్ కెమిస్ట్, డ్రగ్గిస్ట్ అసోసియేషన్ జనరల్ బాడీ సమావేశం పెద్దఅంబర్‌పేటలోని లక్ష్మారెడ్డి పాలెంలో శుక్రవారం నిర్వహించారు. సంఘం జిల్లా అధ్యక్షుడు పెండెం కృష్ణకుమార్ ఆధ్వర్యంలో నిర్వహించిన సమావేశంలో మెడికల్ షాపుల నిర్వాహకులు ఎదుర్కొంటున్న పలు సమస్యలపై చర్చించారు. కార్యక్రమానికి సంఘం హయత్‌నగర్ జోన్ ప్రెసిడెంట్ నరేందర్‌రెడ్డి అధ్యక్షతన జరిగిన సమావేశానికి ముఖ్య అతిథిగా సీఐ రామకృష్ణ హాజరుకాగా, సంఘం సెక్రటరీ మహేందర్‌రెడ్డి, ట్రెజరర్ భగవాన్ దాస్, ఉపాధ్యక్షులు శ్రీహరి, మధు, ప్రవీణ్ తదితరులు పాల్గొన్నారు.

## విద్యార్థులకు పరీక్ష ప్యాడ్‌లు



పెద్దఅంబర్‌పేట, మార్చి 15: అబ్దుల్లాపూర్‌మెట్ మండలం కుత్బుల్లాపూర్ గ్రామంలోని స్వామి వివేకానంద యూత్ ఆర్గనైజేషన్ ఆధ్వర్యంలో ప్రభుత్వ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో పదో తరగతి విద్యార్థులకు శుక్రవారం పరీక్ష ప్యాడ్‌లు అందజేశారు. పెన్నులు, పెన్సిళ్లు, పరీక్షకు అవసరమైన ఇతర వస్తువులు పంపిణీ చేశారు. విద్యార్థులు బాగా పరీక్షలు రాసి గ్రామానికి మంచి పేరు తీసుకురావాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో ఎంపీటీసీ బీమగోని భాస్కర్‌గౌడ్, వివేకానంద యూత్ ఆర్గనైజేషన్ ప్రెసిడెంట్ అరుణ్‌కుమార్, హెచ్‌ఎం జగదీశ్, ఉపాధ్యాయులు కృష్ణ, జ్యోతి, యూత్ సభ్యులు ప్రశాంత్‌కుమార్, వినయ్‌రెడ్డి, వినోద్, వెంకటేశ్, శివ తదితరులు పాల్గొన్నారు.

## కొనసాగుతున్న సీసీ రోడ్డు పనులు



మాదన్నపేట, మార్చి 15: కుర్మగూడ డివిజన్‌లో పెండింగ్‌లో ఉన్న పనులను జీహెచ్‌ఎంసీ అధికారులు చేపట్టారు.సంవత్సర క్రితం రోడ్డు మంజూరైన బడ్జెట్ లేని కారణంగా పనులు జరగలేదు.స్థానికులు,నాయకులు అధికారులకు ఫిర్యాదులు చేయడంతో నూతన రోడ్లకు శ్రీకారం చుట్టారు. శుక్రవారం కుర్మగూడలో నూతన సీసీ రొడ్డు పనులు చేపట్టామని పెండింగ్‌లో ఉన్న పనులను వెంటనే పూర్తి చేస్తామని ఏఈ అన్సారీ తెలిపారు.

# పండుగలు మత సామరస్యానికి ప్రతీక

**డీసీసీబీ డైరెక్టర్ వెంకటేశ్‌గుప్తా**

కడ్తాల్, మార్చి 15: పండుగలు మత సామరస్యానికి ప్రతీకలుగా నిలుస్తాయని డీసీసీబీ డైరెక్టర్ వెంకటేశ్‌గుప్తా అన్నారు. శుక్రవారం మండల కేంద్రంలోని మసీద్-ఖుబాలో మహ్మద్ గౌస్ ఏర్పాటు చేసిన ఇఫ్తారు విందుకు ఆయన ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడారు. పవిత్ర రంజాన్ మాసంలో హిందూ, ముస్లింలు ఇఫ్తారు విందులో పాల్గొంటూ సోదరభావాన్ని చాటుకుంటారని తెలిపారు. ప్రతి ఒక్కరూ కలిసికట్టుగా పండుగలను జరుపుకోవాలన్నారు. అంతకుముందు ముస్లింలు నాయకులు పండ్లు తినిపించి ఉపవాస దీక్షను విరమింపచేసి, వారిని సన్మానించారు. కార్యక్రమంలో ఎంపీటీసీ శ్రీనివాస్‌రెడ్డి, మాజీ సర్పంచ్ లక్ష్మీనర్సింహారెడ్డి, మసీద్ కమిటీ అధ్యక్ష, ఉపాధ్యక్షులు అబ్దుల్ రవూఫ్, జావిద్, ఇమామ్ జహీరుద్దీన్, నాయకులు జహంగీర్‌అలీ, ఇర్షాద్, షఫీ, షకీల్, ఇమ్రాన్, సంతోశ్, శ్రీనివాస్, మహేశ్, సురేశ్ పాల్గొన్నారు.



కడ్తాల్: మండల కేంద్రంలో మసీద్‌లో నమాజ్ చేస్తున్న ముస్లింలు

**మసీదుల్లో ముస్లింల ప్రార్థనలు**

కడ్తాల్ : మండల కేంద్రంతోపాటు వివిధ గ్రామాల్లో పవిత్ర రంజాన్ తొలి శుక్రవారం సందర్భంగా ముస్లింలు ప్రార్థనలు చేశారు. ఈ సందర్భంగా మండల కేంద్రంలోని మజీద్‌లో ఇమామ్ మౌలానా జహీరుద్దీన్ ఆధ్వర్యంలో ఖురాన్ పఠనం, నమాజ్ చేశారు. అనంతరం రంజాన్ పండుగ విశిష్ఠతను ఇమామ్ ముస్లింలకు వివరించారు. తొలి శుక్రవారాన్ని పురస్కరించుకొని మసీద్‌లను విద్యుదీపాలతో అలంకరించారు. నమాజ్ కోసం వచ్చే వారికి ఎలాంటి ఇబ్బందులు కలగకుండా మసీద్ కమిటీ సభ్యులు ఏర్పాట్లు చేశారు. ప్రార్థనల్లో మసీద్ కమిటీ అధ్యక్ష, ఉపాధ్యక్షులు అబ్దుల్ రవూఫ్, అహ్మద్‌జానీ, జావీద్, గౌస్, వాహబ్, హిమయత్‌అలీ, జహంగీర్‌అలీ, అసిఫ్‌అలీ, జహంగీర్‌బాబా, ఇర్షాద్, సలీమ్, నదీమ్, రబ్బానీ, అతీఖ్, ఖాలేద్, లతీఫ్, బారీ, అజ్గర్‌అలీ, ఇమ్రాన్, రహీమ్, మహబూబ్‌అలీ, అనీస్, యూనుస్, సత్తార్, అధికసంఖ్యలో పాల్గొన్నారు.



కడ్తాల్ మండల కేంద్రంలో ముస్లింలను సన్మానిస్తున్న నాయకులు



ఆమనగల్లు మండల కేంద్రంలోని జామ మసీద్‌లో ప్రార్థనలు చేస్తున్న ముస్లింలు

**ఆమనగల్లులో..**

ఆమనగల్లు : పవిత్ర రంజాన్ మాసం తొలి శుక్రవారం సందర్భంగా ఆమనగల్లు మండల కేంద్రంలోని జామ మసీద్, మహ్మదీయ మసీద్, అహ్మద్ హిలాల్ మసీద్‌ల్లో మత గురువులు ప్రత్యేక బోధనలు చేశారు. అనంతరం జుమ్మా నమాజ్‌ను భక్తి శ్రద్ధలతో నిర్వహించి ఫాతియాలు, సలాం కార్యక్రమాలు చేపట్టారు.

## ప్రతి ఒక్కరూ ఆరోగ్యాన్ని పరిరక్షించుకోవాలి

ఎల్బీనగర్ , మార్చి 15 : పేదలు ఉచిత వైద్య శిబిరాలను సద్వినియోగం చేసుకోవాలని కొత్తపేట కార్పొరేటర్ పవన్‌కుమార్ అన్నారు. గురువారం కొత్తపేట తెలంగాణ పార్కు వద్ద రెడీ టూ సర్వ్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ఉచిత వైద్య శిబిరాన్ని ప్రారంభించిన అనంతరం కార్పొరేటర్ పవన్‌కుమార్ పరీక్షలు చేయించుకునాన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ వైద్య పరీక్షలు చేయించుకుని ఆరోగ్యాన్ని పరిరక్షించుకోవాలన్నారు. కార్యక్రమంలో ఫౌండేషన్ ప్రతినిధులు శివ నేత, శంకర్, నాగేశ్వర్‌రావు కాలనీ అధ్యక్షుడు రాంనాథ్‌రెడ్డి, ఎస్‌ఆర్‌ఎల్ కాలనీ అధ్యక్షుడు సుధాకర్, విజయ్‌భాస్కర్, రాకేష్ యాదవ్, ఈశ్వర్, సంగ్రామ్, శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

## దశల వారీగా అభివృద్ధి పనులు

మన్సూరాబాద్, మార్చి 15: శివారు కాలనీల్లో దశల వారీగా అభివృద్ధి పనులు చేపడుతూ ప్రజలకు పూర్తిస్థాయిలో మౌలిక వసతులు కల్పించేందుకు చర్యలు తీసుకుంటున్నట్లు మన్సూరాబాద్ డివిజన్ కార్పొరేటర్ కొప్పుల నర్సింహారెడ్డి తెలిపారు. మన్సూరాబాద్ డివిజన్ హయత్‌నగర్ పరిధి లెక్చరర్స్‌కాలనీలో రూ. 40 లక్షలతో నిర్మిస్తున్న కమ్యూనిటీ హాల్ మొదటి అంతస్తు పనులు, గ్రీన్‌సిటీ కాలనీలో రూ. 10 లక్షలతో ఏర్పాటు చేస్తున్న యూజీడీ, శ్రీదుర్గాకాలనీలో రూ. 21.30 లక్షలతో నూతనంగా ఏర్పాటు చేస్తున్న సీసీరోడ్డు పనులను శుక్రవారం ఆయా కాలనీల సంక్షేమ సంఘాల ప్రతినిధులతో కలిసి ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా కొప్పుల నర్సింహారెడ్డి మాట్లాడుతూ కాలనీల్లో చేపడుతున్న అభివృద్ధిపనుల్లో కాంట్రాక్టర్లు నాణ్యత ప్రమాణాలు పాటిస్తున్నారా లేదా అనే విషయాన్ని కాలనీల సంక్షేమ సంఘాల ప్రతినిధులు గమనించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో వివిధ కాలనీల సంక్షేమ సంఘం ప్రతినిధులు కృష్ణగుప్త, భాస్కర్, రఘునాథ్‌రెడ్డి, కొప్పుల శ్రీనివాస్, సుధాకర్‌రెడ్డి, చింతల యాదగిరి, చంద్రారెడ్డి, వెంకట్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.



కాలనీలో పర్యటిస్తున్న కార్పొరేటర్ నర్సింహారెడ్డి